క్లుప్తంగా

'స్పందన' రద్దు

నెల్లూరు(బారకాసు): ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.

పోలీస్ కార్యాలయంలో..

నెల్లూరు(క్రైమ్): ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని జిల్లా పోలీస్ కార్యాలయాధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పింఛనర్ల సర్వసభ్య సమావేశం నేడు

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘం జిల్లా శాఖ సర్వసభ్య సమావేశాన్ని భక్తవత్సలనగర్‌లోని ప్రభుత్వ పింఛనర్ల సంక్షేమ భవనంలో సోమవారం నిర్వహించనున్నామని సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎస్సెమ్ గౌస్, ఎస్వీవీఎస్ మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛనర్లు తప్పక హాజరుకావాలని కోరారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డిని రామ్మూర్తినగర్‌లోని ఆయన కార్యాలయంలో ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. మత్స్యశాఖ సమస్యలను విజయసాయిరెడ్డికి వివరించారు. అనంతరం ఘనంగా సత్కరించారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతి పాల్గొన్నారు.

రెజ్లింగ్ జట్ల ఎంపికలు నేడు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా రెజ్లింగ్ జట్లను సోమవారం ఉదయం పది గంటలకు ఎంపిక చేయనున్నామని రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగేంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 25 ఏళ్లలోపు వారు అర్హులని, సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు చిత్తూరులో ఈ నెల 20 నుంచి నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నారని చెప్పారు. వివరాలకు 94416 44761 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆర్యవైశ్యుల ఐకమత్యమే ముఖ్యం

• ముక్కాల ద్వారకానాథ్



సత్కార గ్రహీతలతో ద్వారకానాథ్ తదితరులు

నెల్లూరు(బారకాసు): ఆర్యవైశ్యుల ఐకమత్యమే ముఖ్యమని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షుడు, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ పేర్కొన్నారు. స్టోన్‌హౌస్‌పేటలోని ఎస్వీఎస్ కల్యాణ మండపంలో ఆర్యవైశ్య కుటుంబాలకు సేవా ప్రతిభ పురస్కారాల ప్రదాన కార్యక్రమాన్ని నెల్లూరు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆయన మాట్లాడారు. సేవాతత్పరతను గుర్తిస్తూ కళా గురువులు, కళాకారులు, విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరించడంపై హర్షం వ్యక్తం చేశారు. వివిధ సేవా కార్యక్రమాలు, అమ్మవారి ఆలయ నిర్మాణ పనులు తదితరాలను ఆర్యవైశ్యులు ఐకమత్యంగా నిర్వహించారని, దీన్ని చూసి తట్టుకోలేని కొందరు అత్యుత్సాహంతో వేరుగా మరో కార్యక్రమాన్ని తలపెట్టడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని వచ్చే నెల తొమ్మిదిన ప్రారంభించనున్నామని వివరించారు. అనంతరం గుండాల గురవయ్య, విడుపులపాటి సురేష్, శారద, చంద్రకళ, జ్యోత్స్న, శ్రీరామ్ స్వప్న, వాయుగుండ్ల రోషితను సత్కరించారు. వెయ్యి మంది ఆర్యవైశ్య కుటుంబాలకు తాంబూలాన్ని అందజేశారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. అర్బన్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బైసాని జ్యోతిప్రసాద్, గౌరవాధ్యక్షుడు పేర్ల సీతారామారావు, వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన చైర్మన్ శ్రీరామ్‌సురేష్, రూరల్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కనుమర్లపూడి సురేష్, కోట సూర్యనారాయణ, రాచపూడి పెంచలకుమార్, నాగేశ్వరరావు, అయితా భాస్కర్, కొణిజేటి వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



పొదలకూరు : సచివాలయాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఓ చినఓబులేసు

• సర్వేపల్లి ఆర్‌ఓ చినఓబులేసు

పొదలకూరు : ఎన్నికల నియమావళి(మోడరన్ కోడ్ ఆఫ్ కాండక్ట్)ని విధిగా పాటించాలని సర్వేపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ చినఓబులేసు పేర్కొన్నారు. పొదలకూరులో ఎన్నికల నియమావళిని పరిశీలించేందుకు ఆర్‌ఓ ఆదివారం విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ నాయకులకు సంబంధించిన ఫ్లెక్సీలను తొలగించాలని, శిలాఫలకాలు, విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఎన్నికల నియమావళి అమలు ఉంటుందని, అక్కడ కూడా ఫ్లెక్సీలను తొలగించాల్సిందిగా ఆదేశించారు. ఎన్నికల నిబంధనలు పాటించకుంటే వెంటనే తమకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సచివాలయాల్లో సైతం ప్రభుత్వానికి సంబంధించిన పోస్టర్లను తొలగించాలని వివరించారు. ఈ సందర్భంగా పొదలకూరు బిట్–1 సచివాలయాన్ని ఆర్‌ఓ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఆర్‌ఓ వెంట ఎంపీడీఓ మహ్మద్‌రఫీ, వీఆర్వో శ్రీహరి, సెక్రటరీ దొరబాబు తదితరులు ఉన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

వెంకటాచలం: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సర్వేపల్లి నియోజకవర్గ ఆర్‌ఓ చినఓబులేసు హెచ్చరించారు. వెంకటాచలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో భారత ఎన్నికల కమిషన్ ఆదేశాలు, సూచనలను ప్రతిఒక్కరూ పాటించాల్సిందేనని తెలియజేశారు. ప్రభుత్వ కార్యాలయాల గోడలు, బహిరంగ ప్రదేశాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లను ఎక్కడా లేకుండా తొలగించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా, బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

తగ్గుతున్న నిమ్మధరలు



మార్కెట్‌కు వచ్చిన నిమ్మకాయలు

• పెరిగిన ఎగమతులు

పొదలకూరు : నిమ్మకాయల ఎగుమతులు బాగా పెరగడంతో ధరలు తగ్గుతున్నాయి. రెండు రోజులుగా ధరలు తగ్గుముఖం పడుతున్నట్లు వ్యాపారులు వెల్లడించారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో నిమ్మకాయల ధర రూ.70 నుంచి రూ.75 ఉన్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో విస్తారంగా ఉన్న నిమ్మతోటల్లో కాయలను రైతులు కోయకుండా చెట్లకే ఉంచారు. దీంతో పండుతున్న కాయలను ఒక్కసారిగా కోసి మార్కెట్‌కు తరలించడం, ఏలూరు, తెనాలి ప్రాంతాల నుంచి ఢిల్లీ మార్కెట్‌కు కాయల ఎగుమతి పెరగడం వల్ల ధరలు దిగజారుతున్నట్లు తెలుస్తోంది. రైతులు ధరలు ఉంటే పిందెలను కోసి మార్కెట్‌కు పంపడం ధరలు పెరుగుతాయనే సమాచారం ఉంటే తోటల్లోనే కాయలను ఉంచుకోవడం అలవాటుగా మారింది. దీంతో సకాలంలో కోతకు వచ్చిన కాయలను మార్కెట్‌కు తరలించకుండా నష్టపోతున్నట్లు తెలుస్తోంది. మార్చి నెలలో ధరలు పైకి ఎగబాకుతాయని రైతులు భావించి కోతకు వచ్చిన కాయలను కూడా తోటల్లోనే ఉంచారు. ఫలితంగా పండుపడి రాలిపోతున్నట్లు తెలుస్తోంది. సాధారంగా నిమ్మదిగుబడి మార్చి, ఏప్రిల్ మాసాల్లో అధికంగా ఉంటే రైతుల కరువు తీర ధరలు లభించి ఆర్థికంగా నిలదొక్కుకుంటారు. ఈ పరిస్థితి అన్నితోటల్లో ఉండకపోగా కొందరు రైతులకు ధరలు ఉన్న సమయంలో దిగుబడి కూడా ఉండదు. రైతులు మాత్రం ఈ సీజన్‌లో ధరలు బాగా పెరుగుతాయని, బస్తా రూ.10 వేల వరకు పలుకుతుందని ఆశించిన తరుణంలో ధరలు తగ్గడంపై డీలాపడ్డారు. గతేడాదితో పోల్చి చూస్తే ఈ ఏడాది మార్చి ప్రారంభంలో ధరలు తక్కువగానే ఉన్నాయి. వేసవి తాపం పెరిగేకొద్ది ధరలు పెరుగుతాయి. అయితే ఎగుమతులు అధికం అయితే ధరల్లో తేడాలు ఉంటాయని వ్యాపారులు తెలిపారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం



మనుబోలు : నోటీస్ బోర్డులో నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



కోవూరులోని పరీక్ష కేంద్రం

మనుబోలు : మనుబోలు మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధమైనట్లు ఎంఈఓ శేషాద్రివాసు ఆదివారం తెలిపారు. జంబ్లింగ్ విధానంలో మనుబోలు బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. మండలంలోని మనుబోలులో 2, మడమనూరు, వీరంపల్లి, అక్కంపేట, బద్దెవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు శుశృత ప్రైవేటు పాఠశాల ఉంది. వీటిల్లో చదివే 399 మంది విద్యార్థులు మనుబోలులోని రెండు కేంద్రాల్లో పరీక్షలు రాస్తారని తెలిపారు. బాలికల హైస్కూల్లో 210 మంది, బాలుర హైస్కూల్లో 189 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలియజేశారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్ష నిర్వహిస్తారని వివరించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయా కేంద్రాల వద్ద హాల్ టికెట్ నంబర్లు వేసి రూములు కేటాయించారు. ప్రశ్నాపత్రాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు.

నాలుగు కేంద్రాల ఏర్పాటు

పొదలకూరు : పదో తరగతి పరీక్షలను సోమవారం నుంచి నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఫ్యాన్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించారు. పేపర్ లీకేజీ, మాల్‌ప్రాక్టీస్ జరగకుండా అన్నిచర్యలు తీసుకున్నారు. మండల పరిధిలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పొదలకూరులో మూడు, మహ్మదాపురంలో ఒక పరీక్ష కేంద్రాలు ఉన్నట్లు ఎంఈఓ శోభనాద్రి పేర్కొన్నారు. పొదలకూరు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 216 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 250 మంది, చైతన్య స్కూల్లో 184 మంది, మహ్మదాపురం జెడ్పీహైస్కూల్లో 215 మంది మొత్తం 865 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. డిపార్ట్‌మెంటల్, చీఫ్ సూపరింటెండెంట్ గదుల్లో సీసీ కెమెరాల మానిటర్స్ బిగించి ప్రతిక్షణం పర్యవేక్షించే విధంగా ఏర్పాట్లు చేశారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

ముత్తుకూరు : మండల పరిధిలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ముత్తుకూరు ఎస్సై శ్రీనివాసరెడ్డి తెలిపారు. పరీక్షలు జరిగే నాలుగు కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలియజేశారు. ఆయా కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని వెల్లడించారు.

ఐదు కేంద్రాల ఏర్పాటు

కోవూరు : మండల పరిధిలో పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆయా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, జేబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వశిష్ట ఆంగ్ల మాధ్యమ పాఠశాల, సెయింట్ పాల్స్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల, ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రం ప్రాంగణంలో వైద్యారోగ్య సిబ్బందిని ఏర్పాటు చేసి ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూడా సరఫరా చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

• వ్యక్తికి తీవ్రగాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్‌ను కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మండల కేంద్రమైన వెంకటాచలంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. చవటపాళెం గ్రామానికి చెందిన తాటిపర్తి సుబ్బరామయ్య పని నిమిత్తం వెంకటాచలంలోని సర్వేపల్లి క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారు మోటార్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుబ్బరామయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనానికి సమాచారం అందించి చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో జేసీ పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న జాయింట్ కలెక్టర్

విడవలూరు : మండలంలోని ముదివర్తి గ్రామంలో పోలింగ్ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ ఆదివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు జేసీ తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసరావు, వీఆర్వో వెంకటేశ్వర్లు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

• బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత

కోవూరు : మండలంలోని గుమ్మలదిబ్బ గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ ఇల్లు దగ్ధమైన ఘటన శనివారం చోటుచేసుకుంది. దేవరకోట వెంకటరమణయ్య దంపతులు తమ కుమారుడి వివాహ నిమిత్తం సామగ్రి కొనుగోలుకు నెల్లూరుకు వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం సంభవించింది. ఇంట్లోని టీవీ, ఫ్రిజ్, మంచాలు, ఫ్యాన్, బీరువా ఇతర వస్తువులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనలో రూ.లక్షకు పైగా ఆస్తి నష్టం జరిగిందని బాధితులు వాపోయారు. విషయం తెలుసుకున్న గ్రామ వైఎస్సార్‌సీపీ నేత పన్నెం సుధాకర్ బాధితుల ఇంటిని పరిశీలించారు. తన వంతుగా రూ.10 వేల నగదును అందజేశారు. ఈ ప్రమాద ఘటనను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినట్లు బాధితులు తెలియజేశారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

కోవూరు : రెవెన్యూ అధికారులు వారికి కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వహించేలా ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ విజయశ్రీ అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో అన్నిగ్రామాల రెవెన్యూ అధికారులతో ఆదివారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి ప్రతి వీఆర్వో వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలన్నారు. అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో పరిష్కరించేలా తగిన చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా సమీక్షించార

దళిత కుటుంబంపై దాడి



పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన దంపతులు

మనుబోలు: మండలంలోని కొమ్మలపూడి గ్రామంలో ఓ దళిత కుటుంబంపై టీడీపీకి చెందిన ఇద్దరు వ్యక్తులు దాడి చేయడంతో వారు శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు.. తమపై కొమ్మలపూడి గ్రామానికి చెందిన పెంచలయ్య, మనోహర్ అనే వ్యక్తులు దాడి చేసి గాయపరిచినట్లు అదే గ్రామంలోని దళితవాడకు చెందిన మస్తాన్, ఆయన భార్య వైదేహి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి



మనుబోలు : ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

మనుబోలు : గత ఐదేళ్లలో ఇచ్చిన ప్రతిహామీని అమలు చేసి జనరంజక పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఆ పార్టీ నేతలు కోరారు. మనుబోలు పంచాయతీ పరిధిలోని యాచవరం, కేఆర్‌పురంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆదివారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం నియోజకవర్గ ప్రజలకు అండగా నిలుస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మరోసారి అత్యధిక మెజారిటీతో గెలిపించుకుని జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. సర్వేపల్లి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగనంత అభివృద్ధి ఈ ఐదేళ్లలో చేసి చూపించిన ఘనత మన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిదే అని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీ నాయకుల అబద్ధపు హామీలకు మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, గిద్దంటి రమణయ్య, చల్లా నవకోటి, ముంగర రవీంధర్‌రెడ్డి, సయ్యద్ రఫీ, పెంచలయ్య, దాసరి మహేంద్రవర్మ, తుపాకుల గిరి, దువ్వూరు సుధాకర్‌రెడ్డి, పార్థు, కోటేశ్వరగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు : ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు

కేఆర్‌ఆర్ నగర్‌లో..

పొదలకూరు : స్థానిక కాకాణి రమణారెడ్డి నగర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిను తెలియజేసే కరపత్రాలను ఒకటో వార్డు సభ్యుడు, మైనారిటీ నేత షేక్ అంజాద్ ఓటర్లకు అందజేశారు. ఈ సందర్భంగా సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్‌సీపీ హయాంలోనే జరిగిందని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. మోసపూరిత హామీలు ఇచ్చి జనాలను వంచించే నాయకులు వస్తుంటారని వారిని నమ్మవద్దని పేర్కొన్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోస్టర్లు, హోర్డింగ్‌ల తొలగింపు

• అప్రమత్తమైన అధికారులు



కొడవలూరులో గోడలపై పోస్టర్‌లు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

కొడవలూరు : ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చింది. రాజకీయ పార్టీల పోస్టర్‌లు, హోర్డింగ్‌ల తొలగింపుపై దృష్టి సారించారు. ఈఓపీఆర్డీ వి.డేవిడ్ ఆదేశాల మేరకు పంచాయతీల కార్యదర్శులు సిబ్బందితో కలిసి గోడలపై వేసిన పోస్టర్‌లు, కూడళ్లలోని హోర్డింగ్‌లన్నింటినీ ఆదివారం తొలగించారు. కొడవలూరులో పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణ, గండవరంలో కార్యదర్శి ఎం.బ్రహ్మానందరెడ్డి, రామన్నపాళెంలో కార్యదర్శి డి.సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో గోడలపై పోస్టర్‌లు, కూడళ్లలోని హోర్డింగ్‌లు తొలగించారు.

వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట 24న



కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన యాగశాల

ముత్తుకూరు : మండలంలోని తాళ్లపూడి పంచాయతీ కప్పలదొరువులో నూతనంగా నిర్మించిన కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 24వ తేదీన విగ్రహ ప్రతిష్ట జరుగుతుందని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 22వ తేదీ నుంచి ఆలయ శిలాబింబ జీవధ్వజ ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు.

ఈ మేరకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. యజ్ఞాల కోసం ఆలయం వద్ద యాగశాలను ఏర్పాటు చేశారు.

ఓటర్లకు ఇబ్బందుల్లేకుండా..

• పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపుల ఏర్పాటు



ర్యాంపును నిర్మిస్తున్న కూలీలు

మనుబోలు : త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలకు అధికారులు పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా వృద్ధులు, వికలాంగులు పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తకుండా ఆదివారం ర్యాంపులు ఏర్పాటు చేశారు. కొన్ని కేంద్రాల్లో ఉన్న ర్యాంపులు దెబ్బతినగా మరమ్మతులు చేశారు. ర్యాంపు నిర్మాణ పనులను వీఆర్వో నాగార్జునరెడ్డి పరిశీలించారు. వీటితో పాటు అన్నిరకాల మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

విద్యార్థులకు సమయపాలన అవసరం



పరీక్ష మెటీరియల్, వాచ్‌లను అందజేస్తున్న దాతలు

కోవూరు : విద్యార్థి జీవితంలో పదో తరగతి అత్యంత కీలకమని, పరీక్షల సమయంలో సమయపాలన అవసరమని హెచ్‌ఎం నరసింహమూర్తి తెలిపారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ బీసీ వసతి గృహాల్లో ఉంటున్న 75 మంది పదో తరగతి విద్యార్థులకు ప్రభావతి చారిటబుల్ ట్రస్టు ద్వారా పరీక్షల మెటీరియల్స్‌తో పాటు వాచ్‌లను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో ముందుకు సాగాలని తెలిపారు. ట్రస్టు నిర్వాహకులు నాగార్జున, సత్యవతి చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఎంఈఓ రహీమ్ మాట్లాడుతూ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు నూరుశాతం ఫలితాల సాధనే ధ్యేయంగా చదవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహకారం ఎనలేనిదన్నారు. అనంతరం దాతలను సన్మానించారు. కార్యక్రమంలో సంక్షేమశాఖ అధికారులు వెంకట్రావు, పద్మ, సుప్రజ, జ్యోతిరాణి, తదితరులు ఉన్నారు.